క్లుప్తంగా

పాదయాత్ర భక్తులకు స్వాగతం



భక్తులకు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

ఏలేశ్వరం: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఏలూరు గ్రామం నుంచి భద్రచలం పాదయాత్రగా వెళుతున్న 25 యంది భక్తులకు పట్టణంలో శుక్రవారం స్వాగతం పలికారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటీ, బాలాజీచౌక్ ధర్మకర్త గోపు వెంకట్రావు వారికి స్వాగతం పలికి,అల్పాహారం అందజేశారు. తూమురౌతు గురయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

కోటనందూరు: ఇంటిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాతకొట్టాం, టీజే నగరం గ్రామాల్లో జరుగుతున్న ఇంటిపన్ను వసూలు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెలాఖరుకు కొత్త, పాత పన్ను బకాయిలు 100 శాతం వసూలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ గుమస్తాలు సంయుక్తంగా బకాయిదారుల ఇళ్ల కెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా బకాయిదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్నులు చెల్లించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట, జెడ్ రాగంపేట గ్రామాల్లో ఉపాధి పథకంలో జరుగుతున్న చెరువు పనులను ప్రత్తిపాడు క్లస్టర్ పరిధి ఏపీడీ ఎం.భానుప్రకాష్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనితగ్గ వేతనమే వస్తుందని, కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈయన వెంట టీఏ కె.శ్రీను, సిబ్బంది ఉన్నారు.

అకాల వర్షంతో నష్టం

తుని: అకాల వర్షంతో మామిడి, జీడి మామిడి, నిమ్మ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణ పరిధిలో రోడ్లపై వర్షంనీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో మామిడి చెట్ల నుంచి కాయలు, పిందెలు రాలిపోయాయి. ఫల సాయం చేతికి వచ్చే సమయంలో గాలులు తీవ్రంగా వేయడంతో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వ్యవసాయ, ఉద్యాన అధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నేడు పీహెచ్‌సీ భవనం ప్రారంభం

శంఖవరం: గ్రామంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని కాకినాడ ఎంపీ వంగా గీతా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ శనివారం ప్రారంభిస్తారని వైద్యుడు ఆర్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.

కాగడాలతో నిరసన

ఏలేశ్వరం: శృంగవృక్షంలో దాడులకు పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం కాగడాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రాపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాడులకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇండిగబిల్లి వంశీ, నానాజీ, చరణ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం: తొండంగి మండలం శృంగవృక్షంలో జరిగిన రెండు వర్గాల కొట్లాటలో మృతి చెందిన దళిత యువకుని కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని స్థానిక దళిత నాయకులు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ మూడి ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయనను అన్నవరంలో దళిత నాయకులు సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా, మాజీ ఎంపీటీసీ రాజాల చిట్టిబాబు, సరమర్ల మధుబాబు, రాయి శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు.

సస్య రక్షణ చర్యలతో..

అరటిని కాపాడుకోండి

- అకాల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలు
- నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు



శృంగవృక్షంలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి విజయలక్ష్మి

తొండంగి: కురుస్తున్న అకాల వర్షాలకు అరటి తోటలు దెబ్బతిన్నాయి. అధిక పెట్టుబడి పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని దెబ్బతిన్న ఉద్యానవన తోటలపై ప్రాథమిక పంట నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసేందుకు చర్యలు చేపట్టింది. అయితే కొద్దిపాటి సస్యరక్షణ చర్యలతో చేపట్టడం వల్ల పంటను కాపాడుకోవడంతోపాటు పంట దిగుబడిని నష్టపోకుండా రక్షించుకోవచ్చని తుని ఉద్యానవన శాఖాధికారి ఎం.విజయలక్ష్మి తెలిపారు.

60 హెక్టార్లలో దెబ్బతిన్న అరటి తోటలు

తుని నియోజకవర్గంలో తుని మండలంలోని 86 హెక్టార్లు, కోటనందూరు మండలంలో 25 హెక్టార్లు, తొండంగి మండలంలో 120 హెక్టార్ల విస్తీర్ణంలో అరటి తోటల సాగు జరిగింది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట దెబ్బతింది. ఈదుర గాలుల ప్రభావానికి తీరప్రాంతమైన తొండంగి మండలంపైనే ఎక్కువ శాతం పంటకు నష్టం వాటిల్లింది. తొండంగి, శృంగవృక్షం, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, పైడికొండ, పి.అగ్రహారం గ్రామాల్లో దాదాపు 60 హెక్టార్లలో తోటలు దెబ్బతిన్నట్టు ఉద్యానవన శాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న అరటి తోటల్లో ముఖ్యంగా మూడు నెలలు అంత కంటే చిన్న అరటి మొక్కలు 4 నుంచి 5 రోజుల పాటు నీటిలో మునిగితే వేరు వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని చచ్చిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీరు ఆరిన వెంటనే మొక్కలను తీసి నేల ఆరిన వెంటనే తేలికపాటి దుక్కి చేసి, ఆ రకానికి సంబంధించిన అరటి సూది పిలకలను నాటుకోవాలి.

- 5 నుంచి 6 నెలల అరటి తోటల్లో ఐదు రోజుల కంటే ఎక్కువగా మూడు అడుగుల నీరు ఉంటే వెంటనే ఆ నీటిని కింద ప్రాంతాలకు మళ్లించాలి. లేదంటే వేరు వ్యవస్థ కుళ్లిపోతుంది.
- గాలిలో అధిక తేమ కారణంగా తెల్ల చక్కర కేళి, గ్రాండ్‌నైన్, వామన కేళి వంటి రకాలలో సిగటోకా ఆకుమచ్చ తెగులు ఆశిస్తుంది. నేలలో అధిక తేమ వల్ల కూడా బ్యాక్టీరియా దుంపకుళ్లు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు నేల ఆరిన తరువాత గొర్రుతో అంతర సేద్యం చేసి ఒక్కొంటికి 100 గ్రాములు యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను, 20 నుంచి 25 వ్యవధిలో 2 నుంచి మూడు విడతలుగా వేయాలి. ఆకులు తడిసేలా ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ ఒక లీటరుకి తగినంత జిగురు కలిపి వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేయాలి. సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు ఫోపికొనజోల్-1 మిల్లీలీటరు మోతాదు లీటర్ నీటిలో తగినంత జిగురు కూడా కలిపి పిచికారీ చేయాలి.
- అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి దుంప చుట్టూ పోయాలి. లేదా బోర్డో మిశ్రమం ఒక శాతం దుంప చుట్టూ తడిచేలా పోయాలి.
- దుంప కుళ్లిపోతున్నట్టయితే వాటి చుట్టూ 25 గ్రాముల బ్లీచింగ్ పొడి ఒక లీటరు నీటిలో కలిపి మొదలు తడిచేలా పోయాలి. అవసరాన్ని బట్టి 15 రోజుల తర్వాత మళ్లీపోయాలి. అనంతరం వాటి మొదళ్లలో 50 గ్రాముల సూడోమోనాస్, 250 గ్రాముల వేపపిండి వేయాలి.
- గెలలు తయారయ్యే సమయంలో అరటి మొక్కలు ముంపులో ఉంటే నీరు, పోషక పదార్థాలు తీసుకోలేవు. దీనివల్ల గెల తయారవ్వకుండా పక్కానికి వచ్చి నష్టం కలుగుతుంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అరటి ఆకులు గెలలు తడిచేలా ఐదు గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌తోపాటు ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ ఎరువులను వెంటనే మూడు రోజుల వ్యవధిలో మూడు సార్లు ఒక దాని తర్వాత మరొకటి పిచికారీ చేయాలి. గెలలను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచాలి. నేలలో మొక్క చుట్టూ గాడిలో 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి. ఐదు గ్రాముల సూక్ష్మ పోషకాల మిశ్రమానికి జిగురు కలిపి లేత గెలలు తడిచేలా పిచికారీ చేయాలి. లేత గెలలపై (50శాతం కన్నా తక్కువ) కార్బండిజమ్ ఒక గ్రాము లీటర్ నీటికి చొప్పున జిగురుతో కలిపి గెలలు తడిసేలా పిచికారీ చేయాలి.

నివేదిక పంపుతాం



తొండంగి మండలంపై అకాల వర్షం ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రాథమికంగా 60 హెక్టార్లలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. క్షేత్రస్థాయిలో పూర్తి నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నష్టం అంచనా వేస్తున్నాం.

– జి. విజయలక్ష్మి, ఉద్యానవన శాఖాధికారి, తుని

రెండెకరాల్లో నష్టం



ఈదురగాలులతో కూడిన వర్షం కురవడంతో 2.20 ఎకరాల అరటితోటకు నష్టం వాటిల్లింది. సుమారు 65 వేలు పెట్టుబడి పెట్టాను. చెట్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. గెలలు కోతకు వచ్చిన దశలో తోటంతా నశనమైంది. దాదాపు రూ.లక్ష పైగా నష్టపోయాను. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

– పి.సత్యనారాయణ, రైతు

వనదుర్గమ్మకు చండీ హోమం

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శుక్రవారం పర్వదినం సందర్భంగా పండితులు ఘనంగా చండీహోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమంలో హోమద్రవ్యాలను సమర్పించి, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించారు. తరువాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ హోమంలో 15 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు. ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, తొలిపావంచా వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారికి వేద పండితుల ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు.

సత్యదేవుని సన్నిధిలో దేవదాయ శాఖాధికారి



రామచంద్రమోహన్‌కు ఆశీస్సులు అందజేస్తున్న పండితులు

అన్నవరం: దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ (ఏడీసీ) కె.రామచంద్రమోహన్ శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. రామచంద్రమోహన్ స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలను బహూకరించారు.

మెగా వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ సుధారాణి తదితరులు



వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న గణేష్, బాలు, సుధారాణి, శ్రీనివాస్



వైద్యశిబిరంలో పేర్ల నమోదు చేసుకుంటున్న రోగులు

- 406 మంది రక్తదానం, అవయవదానానికి 211 మంది అంగీకారం
- పేదలకు దుస్తులు, అన్నదానం

తుని రూరల్: రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా జన్మదినం సందర్భంగా ఎస్.అన్నవరం శివారు సాయి వేదికలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మారుతీ డయోగ్నోస్టిక్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య, రక్త, అవయవ, వస్త్రదాన శిబిరాలకు విశేష స్పందన లభించింది. శుక్రవారం ఎస్.అన్నవరం శివారు సాయి వేదికలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదానం, అవయవదాన ధ్రువీకరణ పత్రాల నమోదు, వస్త్ర, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వైద్యులు జ్యోతి ప్రజ్వాలన చేసి శిబిరాలను లాంఛనంగా ప్రారంభించారు. కౌన్సిల్‌లో కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం, గాంధీ సత్రం చైర్మన్లు అన్నవరం శ్రీను, అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, సచివాలయ మండల కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు రేలంగి రమణ గౌడ్, పోతల రమణ, వైస్ చైర్మన్ పామర్తి మహేష్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో..

ఉచిత మెగా శిబిరంలో కాకినాడ, తూర్పు గోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన వివిధ విభాగాల నిపుణులైన వైద్యులు 27 మంది పాల్గొని 627 మందికి వైద్య పరీక్షలు చేశారు. సూచనలు, సలహాలు, ఉచిత మందులు అందించారు.

రక్త దానంలో..

ఉభయ గోదావరి జిల్లా యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, స్థానిక యువ నాయకుడు దాడిశెట్టి శ్రీనివాస్, తుని, కోటనందూరు ఎంపీపీలు బొప్పన రాము, లగుడు శ్రీను, శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, తదితరులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన 406 మంది దాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. 211 మంది అవయవ దానం చేసేందుకు అంగీకరిస్తూ ధ్రువీకరణ పత్రాలను అందజేశారని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొరబాబు తెలిపారు.

వస్త్ర, అన్నదానం..

ఈ శిబిరానికి హాజరైన జక్కంపూడి గణేష్‌ను నాయకులు, కార్యకర్తుల ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వందలాది మంది వృద్ధులకు దుస్తులు దుప్పట్లను పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.

అపశృతి..

వైద్యశిబిరంలో పాల్గొనేందుకు తుని పట్టణంలో అద్దాల వీధి నుంచి వచ్చిన ఎస్.సత్యనారాయణ(65) ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సహచరులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



లింగంపర్తి మహాజనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. లింగంపర్తి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహజనసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రైతుల శ్రేయస్సు కోసం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అంతేకాకుండా రైతుల నుంచి పచ్చి ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన నుంచి రైతుల సంక్షేమం కోసమే కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉంటే అవార్డులకు ఎంపిక చేస్తాం



తుని మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తుని: పురపాలక సంఘం పరిధిలో ప్రతిభ కలిగిన మహిళలను అవార్డులకు ఎంపిక చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలకు సమావేశం నిర్వహించారు. తడి, పొడి చెత్త సేకరణ, ఇంటి దగ్గర కంపోస్టు, వ్యర్థాలతో బొమ్మల తయారీలో అనుభవం కలిగిన మహిళలను అవార్డుకు ఎంపిక చేస్తామన్నారు. మెరిట్ జాబితాను స్వచ్ఛంద్రా కార్పొరేషన్‌కు పంపుతామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 28, 29 తేదీల్లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మెప్మా అధికారి శ్రీదేవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టరు శేఖర్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు



ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న రాయుడు, పవన్‌కుమార్

గోకవరం: కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బందికి జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందాయి. మండలంలో టీబీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించినందుకు ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ జి.పవన్‌కుమార్‌కు పురస్కారాలు దక్కాయి. శుక్రవారం రాజమహేంద్రవరంలో జరిగిన టీబీ నివారణా దినోత్సవం కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ, జిల్లా టీబీ అధికారి డాక్టర్ వసుంధర చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర, ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్, ఇతర వైద్య సిబ్బంది, అధికారులు అభినందనలు తెలిపారు.

పామాయిల్ సాగుపై అవగాహన

రౌతులపూడి: మెరకచామవరంలో పతాంజలి ప్రైవేట్ లిమిటెడ్, ఉద్యానవన శాఖ సంయుక్తాధ్వర్యంలో పామాయిల్ సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తెల్లదోమ నివారణ, ఇతర సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. పతాంజలి రౌతులపూడి, తుని క్లస్టర్ మేనేజర్ వెంకటేశ్వరరావు, మురళి రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ స్వాగత కార్యక్రమానికి తరలిరండి

కోటనందూరు: ఎమ్మెల్సీగా ఎన్నికై స్వగ్రామానికి వస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు స్వాగతం పలికే కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు, దళితులు తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడు, రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ వర్కింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆరుగుల మోషే పిలుపునిచ్చారు. శుక్రవారం కోటనందూరులో ఎంఆర్‌పీఎస్, దళిత ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న మధ్యాహ్నం 12 గంటలకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు సమక్షంలో ర్యాలీగా స్వగ్రామం గోడిలంక చేరుకుంటారన్నారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాల్లో ఎంఆర్‌పీఎస్, దళిత ప్రతనిధులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

జగ్గంపేట: కాండ్రేగుల గ్రామంలో సర్పంచ్ బొదిరెడ్డి చక్రబాబు సోదరులు రూ.10లక్షలతో సీతారాముల ఆలయాన్ని పునర్నిర్మించారు. శుక్రవారం ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి విచ్చేశారు. రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో సత్తాచాటిన విద్యార్థులు



గోర్సపాలెంలో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తొండంగి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ పరీక్షలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 12 విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఎంఈఓ షేక్‌బాబ్జి శుక్రవారం తెలిపారు. గోర్సపాలెం ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన మైలపల్లి దీపిక, కుక్కా నాగభాగ్యశ్రీ, యనమల శివదుర్గ, మనిమెల తేజశ్రీ, రాకతి మరియామణి, రాకతి భారతి, ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు పినపోతుల అభిషేక్, ఆశిన యవ్వంత్, వాసంశెట్టి దివ్య, సోము లలిత, సోము హేమశ్రీదేవి ఎంపికయ్యారు. బెండపూడికి చెందిన విద్యార్థిని పి.శ్రావ్య కూడా ఎంపికయ్యారన్నారు. వీరికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకారవేతనం అందుకుంటారన్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలి



ఏలేశ్వరంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సీతంపేటలో క్షయ వ్యాధి నివారణకు ర్యాలీ చేస్తున్న రిఫరల్ ఆసుపత్రి బృందం



పెద్దిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలని మండల వైద్యాధికారి డి.శైలజ సూచించారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారి శైలజ, టీబీ సూపర్‌వైజర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక బాలాజీచౌక్ వద్ద మానవహారం చేశారు. స్థానిక ఆసుపత్రి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా బాలాజీచౌక్ వరకూ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షక్షయ వ్యాధి నివారణకు తగిన వైద్యం పొందడం ద్వారా నివారించవచ్చున్నారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆరోగ్య కార్యకర్తల పర్యవేక్షణలో వైద్య సేవలు పొందాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందులు పొందవచ్చని తెలిపారు. అనంతరం క్షయవ్యాధి నివారణకు వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఎంపీహెచ్‌ఈఓ కె.భాస్కరరావు, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేశారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు పది మంది టీబీ రోగులకు పౌష్టికాహారం అందించారు. లయన్స్ క్లబ్ పది మంది టీబీ రోగులను దత్తత తీసుకొని ఆరు నెలలు పాటు పౌష్టికాహారం అందిస్తున్నారని మండల వైద్యాధికారి శైలజ తెలిపారు. టీబీ సూపర్‌వైజర్ అనిల్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గా వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

గోకవరం: టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే టీబీ నివారణకు ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఎమ్ చిమ్మరాజుదొర, వైద్య సిబ్బంది పవన్, రమణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: క్షయా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఐ.రత్నంబాబు అన్నారు. పెద్దిపాలెంలో వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి ఆనందు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గండేపల్లి: అవగాహనతోనే క్షయవ్యాధిని నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి .సౌమ్య అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గండేపల్లి ఆరోగ్య కేంద్రం వద్ద క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: సీతంపేట రిఫరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి అనంతరం రిఫరల్ ఆసుపత్రి చైర్మన్ స్లెసర్ బాబు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ ఎస్.రాజీవ్‌కుమార్, సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.